క్లుప్తంగా

'ఎమ్మార్సీ' తనిఖీ



ఎంఈవోతో మాట్లాడుతున్న డీఈవో

తాండూర్: మండల మానవ వనరుల విద్యా కేంద్రాన్ని బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) యాదయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అపార్ ఐడీ, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లుల గురించి మండల విద్యాశాఖ అధికారి మల్లేశంను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాదారం మండల పరిషత్ పాఠశాలను సందర్శించారు. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

బడి బయటి పిల్లల గుర్తింపు



విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎస్సై శ్వేత

భీమారం: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం బడిబయట పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. అరుగురిని ఆపరేషన్ స్మైల్ బృందం గుర్తించారు. ఎస్సై శ్వేత, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో వారిని భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. పాఠశాలలో గతంలో చదివిన డేగ.జశ్వంత్(9వతరగతి), దైనేని రాజ్ కుమార్(9వ తరగతి), దుర్గం అజయ్‌కుమార్(10వ తరగతి), కందునూరి రామ్‌చరణ్(10వ తరగతి), ఎల్లాది రామ్‌చరణ్(6వ తరగతి) చిప్పకుర్తి జశ్వంత్(10వ తరగతి)లు చదివి మధ్యలో ఆపేశారు. వారికి మళ్లీ అడ్మిషన్లు ఇప్పించి పాఠశాలలో చేర్పించామన్నారు.

బి.సంజీవరెడ్డికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సంజీవరెడ్డి

మంచిర్యాలఅగ్రికల్చర్: తమిళనాడులో హోసూర్ పట్టణంలో జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి ఏషియన్ ఇంటర్నేషనల్ రిసర్చ్ కల్చరర్ యూనివర్సిటీలో బుధవారం డాక్టరేట్ అందుకున్నారు. సహకార సంఘాల బలోపేతానికి కృషి చేసి, సామాజిక సేవలో మానవత్వం చాటుకున్నందుకు డాక్టరేట్ దక్కినట్లు తెలిపారు. జిల్లా సహకార శాఖ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న డీపీఎం వేణుగోపాల్

భీమారం: సమాజానికి మహిళలు ఆదర్శంగా నిలబడాలని ఐకేపీ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వేణుగోపాల్ కోరారు. మండల కేంద్రంలో మణికంఠ మహిళా సంఘం వార్షికోత్సవానికి బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్వయం ఉపాధి పొందాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాల్లో మహిళలను భాగస్వామ్యం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం త్రియంబక్, స్టేట్ బ్యాంక్ మేనేజర్ సుబ్బారెడ్డి, ఐకేపీ సీసీ దర్శనాల శంకర్‌తో పాటు 200మంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ పరేషాన్!

బజారు ఏరియాలో రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన బైక్‌లు



'మున్సిపాలిటీ ఏర్పడితే గింత అధ్వానంగా ఉంటదనుకోలే. గిన్నేళ్ల నంది ఏంఫాయిదా లేకుంటున్నది. మున్సిపాల్టీ గాకముందు ఎట్లుండెనో గిప్పుడు సుత గట్లనే ఉన్నది. ఏండ్లు గడుస్తున్నయ్‌గని.. ఏం ఫరక్ రాలే. అరె ...గిన్నేళ్లనంది బైక్‌లకు పార్కింగ్ స్థలం సుత ఏర్పాటు చెయ్యలే. గెల్సినోళ్లు ఎవల కాళ్లు వాట్సాప్‌లల్ల ఫొటోలు పెట్టుడు తప్పా పబ్లిక్‌కు ఫాయిదచ్చే పనుల జోలికి ళ్లలే. గిస్సంటోళ్లను ఏమనాలే. ఐదేళ్ల క్రితం ఓట్లళ్ల గెల్సినోళ్లు మళ్లచ్చే వారంల దిగిపోవడానికి తయారైండ్లు. గాళ్లు గిట్ల పట్టింపు జేయకపోబట్టి బైక్‌లకు పార్కింగ్ స్థలాలు లేకుంటున్నయ్. పార్కింగ్ స్థలాలు లేక మస్తు తిప్పలైతంది. ఎక్కడ దిక్కులేక ఫుట్‌పాత్ మీద బైక్ పార్కింగ్ చేసి పోలీసోళ్లకు ఫైన్ కట్టుడైతంది. గిట్ల దినాం తక్లీఫైన సెద్ద పెట్టెటోళ్లు కరువైండ్లు..' ఇదీ బెల్లంపల్లిలో బైక్‌ల పార్కింగ్‌కు చోటు లేక మున్సిపాలిటీలోని అంబేద్కర్ రడగంబాల బస్తీకి చెందిన సమ్మయ్య అనే ఓ సాధారణ ద్విచక్ర వాహనదారుడి ఆవేదన. ఆ ఆవేదన ఆయనొక్కడిదే కాదు మున్సిపాలిటీలో నివాసం ఉంటున్న, గ్రామీణ ప్రాంతాల నుంచి బెల్లంపల్లికి వచ్చే ద్విచక్ర వాహనదారులందరిదీను.

- రద్దీ పెరిగినా పట్టింపు కరువు
- ఫుట్‌పాత్‌లు, షాప్‌ల ఎదుటే వాహనాలు
- విపరీతమైన రద్దీతో ట్రాఫిక్ సమస్యలు
- ఏళ్లు గడుస్తున్నా పార్కింగ్ స్థలాల ఏర్పాటేది..?
- బెల్లంపల్లి మున్సిపాలిటీలో వాహనదారులకు కష్టాలు

బెల్లంపల్లి: చంద్రవెల్లి గ్రామపంచాయతీ నుంచి వేరుపడి కార్మిక క్షేత్రం బెల్లంపల్లి 1987లో ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా ఏర్పడింది. మున్సిపాలిటీగా అవతరించి ఇప్పటికీ 38ఏళ్లు కావస్తున్నా ఆశించిన రీతిలో అభివృద్ధి సాధించలేదు. మున్సిపాలిటీకి తక్కువ, గ్రామీణ ప్రాంతానికి ఎక్కువ అన్న చందంగా తయారైంది. పుర ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంలో మున్సిపల్ పాలకులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇన్నేళ్ల కాలంలో కనీసం మోటారు సైకిళ్లను పార్కింగ్ చేయడానికి స్థలాలు ఎంపిక చేయకపోవడం పాలకుల పట్టింపులేని తనానికి అద్దం పడుతోంది.

రద్దీగా బజారు ఏరియా ప్రాంతం..

మున్సిపాలిటీలో 34వార్డులున్నాయి. కార్మిక, కార్మికేతర ప్రాంతాలు కలబోసి ఉన్న మున్సిపాలిటీలో అనధికారిక లెక్కల ప్రకారం దాదాపు 15వేలకు పైగా బైక్‌లు ఉన్నట్లు అంచనా. వివిధ అవసరాల కోసం రోజువారీగా చుట్టు ప్రక్క గ్రామీణ ప్రాంతాల నుంచి మరో 5నుంచి 7వేల మధ్యలో మోటారు సైకిళ్లు బెల్లంపల్లికి రాకపోకలు సాగిస్తాయి. ఆ తీరుగా రోజుకు గరిష్టంగా 22వేల వరకు బైక్‌లు బెల్లంపల్లిలో సంచారం చేస్తుంటాయి. ఇతర ప్రాంతాలతో పోల్చితే బజారు ఏరియాకు బైక్‌పై రావడానికి వాహనదారులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఏ అవసరానికి వచ్చినా అంబేద్కర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ చౌరస్తా వరకు అంతర్గత ప్రధాన రహదారిని ఆనుకొని ఫుట్‌పాత్‌పై, షాపుల ముందు అనివార్యంగా మోటారు సైకిళ్లను నిలిపి ఉంచాల్సి వస్తోంది. ఈ మార్గం మీదుగానే ఆర్టీసీ బస్సులు మంచిర్యాల– ఆసిఫాబాద్ వైపు ప్రతి పది నిమిషాల కొకటి చొప్పున ఇరువైపులా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో బజారు ఏరియాలో వాహనాల రద్దీ విపరీతంగా ఉండటంతోపాటు, అనివార్యంగా ఫుట్‌పాత్‌పై బైక్‌లను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇదే క్రమంలో పోలీసులు వచ్చి బైక్‌ల ఫొటోలు తీసి జరిమానా వసూలు చేయడం సాధారణ తంతుగా మారింది. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నా అటు పోలీసులు కానీ, ఇటు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కానీ కనీస చర్యలు తీసుకోక పోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా బైక్‌ల పార్కింగ్ కోసం స్థలాలు గుర్తించే చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం



మున్సిపాలిటీలో బైక్‌ల పార్కింగ్ స్థలాల గుర్తింపు కోసం కసరత్తు జరుగుతోంది. ప్రధానంగా బజారు ఏరియా ప్రాంతంలో సమస్య తీవ్రత అధికంగా ఉంది. పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ఫుట్‌పాత్ మీద వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. ఈ సమస్యను అధిగమించడానికి త్వరలోనే ప్రతిపాదనలు చేస్తాం. స్థలాల ఎంపిక ప్రక్రియను సత్వరంగా పూర్తిచేసి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి

ఆలయం నిర్వహణ మరిచిన సింగరేణి



శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ముఖ ద్వారం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలో ఐదు దశాబ్దాల క్రితం ఏర్పాటైన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వహణను సింగరేణి విస్మరించింది. కార్మిక కుటుంబాల్లో ఆధ్యాత్మికత కోసం అప్పటి డీవైపీఎం కళ్యాణ రామన్ సింగరేణి వ్యాప్తంగా పలు ఏరియాల్లో ఆలయాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ కోసం దుకాణాలు నిర్మించి వాటి అద్దె ఆలయానికి చెందేలా కేటాయించారు. సింగరేణి ఏరియా జీఎం ఆలయ అధ్యక్షుడుగా, డీవైజీఎం(సివిల్) ఆలయ కార్యదర్శిగా ఉన్న కమిటీ ఆధ్వర్యాన ఆలయంలో కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా ఆలయంలో కార్యక్రమాల లావాదేవీలను సంస్థ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఆలయంలో కార్యక్రమాలను ఏరియాలోని పలు విభాగాల ఉద్యోగుల ద్వారా సేకరించిన డబ్బులు, కానుకల ద్వారా నిర్వహించేవారు. ఆలయ ప్రాంగణంలో హుండీ ఏర్పాటు చేసి వచ్చే డబ్బులు, కానుకులను కమిటీ ఆధ్వర్యంలో లెక్కించి ఆలయ అవసరాలకు వినియోగించేవారు. ప్రస్తుతం హుండీ ఏర్పాటు చేయలేదు. మందమర్రి ఏరియాలోని మూడో జోన్ సీతారామచంద్రస్వామి దేవాలయం ఏరియాలోని కేకే–5 గని అధికారుల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగుతోంది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హుండీ కమిటీ పర్యవేక్షణలోనే లెక్కింపు జరగాలని, నిర్వహణకు కమిటీ ఉండాల్సిందేని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మందమర్రి ఏరియా డీవైజీఎం(సివిల్) రాములును సంప్రదించగా.. తాను ఇటీవలే బదిలీపై వచ్చానని, టెంపుల్ కమిటీ బాధ్యతలు గతంలో పనిచేసిన అధికారి అప్పగించలేదని, ఆలయ నిర్వహణపై అధికారులలు, అర్చకులను అడిగి తెలుసుకుంటానని తెలిపారు.

ఓసీసీ 'గుర్తింపు' ఎన్నికలు వాయిదా



కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంటు కంపెనీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి. రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ఆరేళ్లుగా వాయిదా పడుతూనే ఉన్నాయి. ఈ నెల 17న ఆదిలాబాద్‌లో సమావేశం నిర్వహించిన కార్మిక శాఖ అధికారులు 28న మరో సమావేశం నిర్వహించి ఎన్నికల తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. కానీ 28న జరగాల్సిన సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు యూనియన్లకు సమాచారం ఇచ్చారు. ఎన్నికల్లో అధికార పార్టీ నుంచే రెండు మూడు యూనియన్లు బరిలో ఉండే అవకాశాలు ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే అనుచరుల తోపాటు మరో నియోజకవర్గ ఎమ్మెల్యే సోదరుడి యూనియన్ పోటీ పడనుంది. దీంతో స్థానిక ఎమ్మెల్యే తెరవెనుక ఉండి చక్రం తిప్పి ఎన్నికలు వాయిదా వేయించినట్లు సమాచారం. మరో ఎమ్మెల్యే సోదరుడికి చెక్ పెట్టేందుకే కాలం గడిచిపోవాలని చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఎన్నికలకు సిద్ధమైన ఎమ్మెల్యే సోదరుడికి చేదు అనుభవమే ఎదురైంది. ఎన్నికల నిర్వహణ నిలిపి వేశామని సంతృప్తితో మరోవర్గం నాయకులు ఉన్నారు. గతంలోనూ వర్గపోరుతో వాయిదా వేస్తూ వచ్చారు.

బందోబస్తు ఇవ్వలేరా..

ప్రభుత్వం, పోలీసుశాఖ తీరుపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు బందోబస్తు ఇవ్వలేమనే పోలీసు శాఖ నివేదిక ఆధారంగా కార్మికశాఖ ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది. 270మంది ఓటర్లు మాత్రమే ఉన్న సంఘం ఎన్నికలకు బందోబస్తు ఇవ్వలేక ఎలా అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

అటవీ అధికారుల తీరుపై ఆగ్రహం

- ప్రధాన రహదారిపై ప్రజలు, వ్యాపారుల రాస్తారోకో
- డ్రైవర్‌ను కొట్టిన ఎఫ్ఆర్వోను సస్పెండ్ చేయాలని డిమాండ్
- డీఎఫ్‌వో హామీతో ఆందోళన విరమణ



రాస్తారోకో చేస్తున్న మండల వాసులు

జన్నారం: మంచిర్యాల నుంచి సొంత పనులు ముగించుకొని తిరిగి ఇంటికొస్తున్న మోబిన్ పాషా అనే వ్యక్తిపై అటవీశాఖ అధికారులు ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్వో రమాదేవి చేయి చేసుకున్నారనే ఆగ్రహంతో జన్నారం మండలకేంద్రానికి చెందిన ప్రజలు, వ్యాపారులు రోడ్డెక్కారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ప్రధాన రహదారిపై రాస్తారోకోకు దిగారు. ఏఎంసీ వైస్ చైర్మన్ ఫసీఉల్లా, మాజీ ఎంపీటీసీ రియాజోద్దీన్, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు సోహేల్, అజ్మత్, షాదుపాష, అజార్‌లతో పాటుగా పలువురు వ్యాపారులు మోబిన్‌కు మద్దతుగా నిలిచారు. రెండు గంటల పాటు చేసిన రాస్తారోకోతో ఇరువైపులా వాహనాలు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జన్నారం ఎస్సై రాజవర్ధన్ వారిని సముదాయించినా వినలేదు. లక్సెట్టిపేట సీఐ నరేందర్, దండేపల్లి ఎస్సై ఉదయ్‌కుమార్, పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని రాస్తారోకో దిగిన వారితో మాట్లాడి నచ్చజెప్పినా సద్దుమనుగలేదు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుతో ఫోన్‌లో మాట్లాడించగా, తాను వచ్చి మాట్లాడుతానని తెలుపడంతో రోడ్డుపై నుంచి లేచి ఎఫ్‌డీవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని డీఎఫ్‌వో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే



తిరుపతిరెడ్డి పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నెన్నెల: మండలంలోని కోణంపేటకు చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ కంకణాల తిరుపతిరెడ్డి (47) బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆ గ్రామానికి చేరుకొని తిరుపతిరెడ్డి పాడెను శ్మశానం వరకు మోసి సానుభూతి తెలిపారు. ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దగ్గరుండి అంత్యక్రియలు జరిపించారు.

సంక్షిప్త వార్తలు

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాలక్రైం: ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద బుధవారం సీసీ టీవీ వినియోగం, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు.

బన్సాల్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీనవాస గార్డెన్ సమీపంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా నడుపుతున్న బన్సాల్ కార్పొరేట్ కళాశాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. డీసీపీ భాస్కర్‌కు ఆయన కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు.

'ఎస్సీ వర్గీకరణకు సీపీఐ అనుకూలం'

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణకు సీపీఐ పార్టీ తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సబ్‌జైల్‌లో ఐసీటీసీ ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అండర్ ట్రయల్ ఖైదీలు 30మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, జైలర్ స్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటశిబిరంపై దాడి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్ శివారులో బుధవారం పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.రూ. 6300నగదు, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

శ్రీరాంపూర్: జాతీయ కుష్ఠు నివారణ కార్యక్రమంలో భాగంగా నస్పూర్ గ్రామంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. డివిజన్ సామాజిక ఆరోగ్య అధికారి రామమూర్తి ఆధ్వర్యంలో ప్రజలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధిని త్వరగా గుర్తిస్తే ఎండీటీ చికిత్స ద్వారా పూర్తిగా తగ్గించవచ్చన్నారు. ఆరోగ్య సహాయకులు మంతెన వెంకటేశ్, శ్రీమతి, డీ పుష్ప, అక్తర్‌బేగం, శ్రీపతి పావని, సిరిపురం మల్లేశ్వరీ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కోటపల్లి: క్రీడల్లో గెలుపోటములు సహజమని మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ అన్నారు. ఆలుగామలో మాజీ సర్పంచ్ కుమ్మరిసంతోశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు బుధవారం రూ.50వేల నగదు, రన్నరప్ జట్టుకు రూ.25వేల నగదుతో పాటు టీషర్టులు అందజేశారు. మాజీ సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్



మాట్లాడుతున్న కేకే-5 గని మేనేజర్

మందమర్రిరూరల్: ఉద్యోగులు గైర్హాజర్ పేరిట సంస్థకు నష్టం కలగజేసి ఉద్యోగాలు కోల్పోవద్దని కేకే–5 గని మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. గని ఆవరణలో పలువురు గైర్హాజర్ కార్మికులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అండర్ గ్రౌండ్‌లో విధులు నిర్వర్తించే వారు ప్రతినెలా కనీసం 16మస్టర్లు, ఉపరితలంలో విధులు నిర్వర్తించే వారు కనీసం 20మస్టర్లు చేయాలని సూచించారు. గని రక్షణ అధికారి రమేష్, సంక్షేమాధికారి కార్తీక్, ఆఫీస్ సూపరింటెండెంట్ సముద్రాల బుచ్చయ్య, యూనియన్ ప్రతినిధులు ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

గుర్తింపు సంఘంతో సమావేశం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులకు, సింగరేణి యాజమాన్యం మధ్య ఏరియా స్థాయి స్ట్రక్చరల్ సమావేశం జరిగింది. జీఎం ఎల్వీ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గుర్తింపు సంఘం బ్రాంచీ కార్యదర్శి ఎస్కే బాజీసైదాతో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో గుర్తింపు సంఘం ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏఐటీయూసీ నాయకులు కొమురయ్య, ప్రసాద్ రెడ్డి, చంద్రమోహన్, సంపత్ పాల్గొన్నారు.

పనిముట్లు సమకూర్చాలి

శ్రీరాంపూర్: కార్మికులకు పని స్థలాల వద్ద పనిముట్లు సమకూర్చాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదాలు బుధవారం ఆర్కే 5గనిని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, ఏరియా కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, సంపత్, ఫిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగారావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ సహాయ కార్యదర్శి లక్కిరెడ్డి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

ఆదమరిస్తే వాగులోకే!



దండేపల్లి: లక్సెట్టిపేట-నిర్మల్ రహదారిపై దండేపల్లి-నెల్కివెంకటాపూర్ గ్రామాల మధ్య వాగుపై గల వంతెనకు సమీపంగా కొంత దూరం వరకు ఎలాంటి రక్షణ దిమ్మెలు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా వాగులోకి దూసుకెళ్లడమే. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి, వంతెనకు సమీపంగా కొద్దిదూరం వరకు రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: రవికిరణ్, ఆర్అండ్‌బీ ఏఈఈ , ఫోన్ నంబర్: 96424 21757

నేడు ఎమ్మెల్యే వివేక్ పర్యటన

చెన్నూర్‌రూరల్: నియోజకవర్గంలో ఎమ్మెల్యే గడ్డం వివేక్ గురువారం పర్యటించనున్నారు. మందమర్రిలోని దీపక్‌నగర్‌లో క్యాలెండర్ ఆవిష్కరణ, మందమర్రి మున్సిపాలిటీ ఆవరణలో అమృత్ స్కీం వాటర్ పైప్‌లైన్ ప్రారంభం, అనంతరం జైపూర్ మండలంలోని రామారావుపేటలో సింగరేణి రోడ్డును సందర్శించనున్నారు. వీవీ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేస్తారు. అనంతరం చెన్నూర్ మండలంలోని కాచన్‌పల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.7లక్షల నిధులతో నిర్మించిన ప్రహరీని ప్రారంభిస్తారు. చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులతో రివ్యూ సమావేశంలో పాల్గొంటారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కాసిపేట: మండలంలోని కొండపూర్ 33/కేవీ చెడిపోయిన పాత అండర్‌గ్రౌండ్ కేబుల్ తొలగించి నూతన కేబుల్ మార్చుతున్నందునా గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

రేపు హోటల్స్ బంద్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఈ నెల 31న అన్ని రకాల హోటల్స్‌ను బంద్ పెట్టి ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు హోటల్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు రేగుంట రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బంద్‌లో టీ, టిఫిన్స్, మిర్చి బండ్లు, మీల్స్, బిర్యానీ విధిగా పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించే సమావేశంలో.. హోటల్ యాజమానులు, సభ్యుల సమస్యలపై, ప్రత్యేకించి పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలపై చర్చించి ధరల నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశానికి జిల్లా హోటల్ యూనియన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ శెట్టి పాల్గొంటారని తెలిపారు. హోటల్ యాజమానులు, సభ్యులు సమావేశానికి తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

సమాచారం

7న 'లక్ష డప్పుల మహాప్రదర్శన'

జన్నారం: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో 'వెయ్యి గొంతులు–లక్ష డప్పుల మహా ప్రదర్శన' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలనే డిమాండ్‌తో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్ బుధవారం కోరారు.

'లక్ష డప్పులు' కార్యక్రమానికి తరలిరావాలి

రామకృష్ణాపూర్: ఎస్సీ వర్గీకరణకు డిమాండ్ చేస్తూ వచ్చే నెల 7న మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తలపెట్టిన 'లక్ష డప్పులు వేయి గొంతుకలు' కార్యక్రమానికి మాదిగ కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాదిగ కుల సంఘం నాయకులు బుధవారం పిలుపునిచ్చారు. వర్గీకరణ జరిగే వరకు పోరాటం తప్పదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, ఆరుముళ్ల పోషం, శంకర్, కల్యాణ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

20న బహిరంగ సభ

పాతమంచిర్యాల: ఎన్నికల హామీలు అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో బుధవారం నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో అందె మంగ, జ్యోతి, అరుణ, లాల్‌కుమార్, తిరుపతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల కోసం గడువు పెంపు

మందమర్రిరూరల్: సింగరేణి రిటైర్డ్ కార్మికుల వైద్య సౌకర్యం కోసం యాజమాన్యం కల్పించిన సీపీఆర్ఎంఎస్ దరఖాస్తుల కోసం మార్చి 31వరకు యాజమాన్యం అవకాశం కల్పించినట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఇంత వరకు దరకాస్తు చేసుకోని రిటైర్డ్ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థుల పొలంబాట



మందమర్రిరూరల్: పట్టణంలోని ఫిల్టర్‌బెడ్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బుధవారం పొలంబాట పట్టారు. క్షేత్ర పర్యటనలో భాగంగా శంకరపల్లి గ్రామానికి వెళ్లి పొలం పనుల్లో భాగస్వాములయ్యారు.